సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 12 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.32,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32,500, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.18
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.8, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
32.8°/16.7°
జిల్లాలో సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆదర్శప్రాయుడు అబుల్ కలాం ఆజాద్

- కలెక్టర్ టీఎస్ చేతన్
- పుట్టపర్తిలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్య్ర సమర యోధునిగా, భారత తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారని, ఆయన ఎందరికో ఆదర్శప్రాయుడని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. సోమవారం పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాలులో మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం అజాద్ 137 జయంతి వేడుకలను, మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని, జాతీయ విద్యాదినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ టీఎస్ చేతన్ హాజరై ఆజాద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప దేశభక్తుడన్నాడు. దేశ తొలి విద్యాశాఖామంత్రిగా 11 ఏళ్లపాటు విద్యారంగానికి ఎనలేని సేవలందించారన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. వృత్తి విద్య, క్రీడా విద్యను ప్రోత్సహించారని గుర్తు చేశారు. దేశానికి అబుల్ కలాం అజాద్ చేసిన సేవలు గుర్తించి ఆయన జయంతి రోజున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా మైనార్టీ సంక్షేమం, జాతీయ విద్యాదినోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీల కోసం అమలు చేస్తున్న సంక్షేమం పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డీఈఓ కిష్టప్ప మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశాలని చేసిన సేవలు, విద్యారంగంలో తీసుకొచ్చిన మార్పులను కొనియాడారు. జిల్లాలోని వివిధ ఉర్దూ మీడియం పాఠశాలలు, మదరసాలలో 5,781 మంది విద్యార్థుల చదువుకుంటున్నారని, 288 మంది ఉపాధ్యాయులు బోధన చేస్తున్నట్లు వివరించారు. అనంతరం జిల్లాల్లో వివిధ పాఠశాలల్లో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని, ఉర్దూ బాషాభివృద్ధికి కృషి చేసిన పులువురిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, విద్యాశాఖ అధికారి కిష్టప్ప, ఎంఈఓ ఖాదర్‌వలి, మైనార్టీ సంక్షేమ శాఖ వార్డెన్ రఫీ, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రహీం హుస్సేన్, క్రిష్టియన్ కార్పొరేషన్ చైర్మన్ మధుసుదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులురాలు పర్వీన్ భాను, మైనార్టీ నాయకులు రఫీ, అబ్దుల్, షామీర్‌బాషాతో పాటు వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు 'సాత్విక్'



రామగిరి: జాతీయ స్థాయి హాకీ పోటీలకు మండల పరిధిలోని కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సాత్విక్ ఎంపికై నట్లు సోమవారం ఆ పాఠశాల పీడీ నగేష్‌బాబు తెలిపారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీల్లో సాత్విక్ ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో నిర్వాహకులు అతన్ని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. డిసెంబర్ నెలలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో సాత్విక్ పాల్గొంటాడని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సాత్విక్‌ను హెచ్‌ఎం అనంతపద్మనాభంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అరకొర నిధులు.. అంకెల గారడీతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసింది. సోమవారం అసెంబ్లీలో రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా... ఏ రంగానికీ పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేకపోయింది. రైతులు, నిరుద్యోగులు, మహిళలు..ఇలా ఏ వర్గానికీ సాయంగా నిలవలేకపోయింది. అందుకే అందరూ.. 'అంతన్నాడు.. ఇంతన్నాడే చంద్రబాబు..' అంటూ పాడుకుంటున్నారు.

- బడ్జెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు మొండిచేయి
- పరిశ్రమల ఊసు లేదు.. కొత్త పెట్టుబడులూ లేవు
- నిరుద్యోగ భృతి.. అంతా భ్రాంతి
- వ్యవ 'సాయం' లేని కూటమి బడ్జెట్
- మహిళపై మమకారం చూపని పాలకులు
- సాగునీటి రంగానికీ అరకొర నిధులు
- సొంత జిల్లాపై కరుణ చూపని ఆర్థిక మంత్రి కేశవ్
- కూటమి బడ్జెట్‌పై అన్ని వర్గాలూ పెదవివిరుపు

నిధులు కల్ల.. కేటాయింపు డొల్ల!



అనంతపురం: అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ తొలి బడ్జెట్‌లోనూ అంకెల గారడీ చేసింది. ఏ వర్గానికీ న్యాయం చేయలేకపోయింది. చివరకు సూపర్ సిక్స్ అంటూ గొప్పలు చెప్పిన పథకాలనూ విస్మరించడంతో అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తన సొంత జిల్లా అనంతపురంపైనా మమకారం చూపలేకపోయారు. ఉచిత పంటల బీమాకు మంగళం పాడారు. జిల్లాకు జీవనాడి హెచ్చెల్సీకి అత్తెసరు నిధులు కేటాయించడంతో రైతన్న అన్యాయమై పోయాడు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులకు కూడా పెద్దగా నిధులు కేటాయించలేదు. నిరుద్యోగ భృతి భ్రాంతిగానే మిగిలింది. దీంతో కూటమి సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చూసి ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులంతా పెదవి విరుస్తున్నారు.

హెచ్చెల్సీకి మొండిచేయి

జిల్లాలో ప్రధానమైన హెచ్చెల్సీకి బడ్జెట్‌లో మొండిచేయి చూపారు. హెచ్చెల్సీ స్టేజ్– 1 కింద రూ.108 కోట్లు, స్టేజ్–2 కింద రూ.684 కోట్లకు ప్రతిపాదనలు చేశారు. అయితే రాష్ట్ర బడ్జెట్‌లో హెచ్చెల్సీ స్టేజ్–1కు రూ.2 కోట్లు, స్టేజ్–2కు రూ.26.2 కోట్లు.. మొత్తంగా రూ.28.2 కోట్లు మాత్రమే కేటాయించి రైతన్నలకు అన్యాయం చేశారు. హంద్రీ–నీవాకు కూడా రూ.867.75 కోట్లు మాత్రమే కేటాయించారు. హంద్రీ–నీవా కాలువ వెడల్పునకు రూ.6,700 కోట్లు కావాలని ప్రతిపాదనలు చేయగా, కేవలం రూ.867.75 కోట్లు కేటాయించారు. ఇక తుంగభద్ర దిగువ కాలువ (ఎల్‌ఎల్‌సీ)కు రూ.90 కోట్లు ప్రతిపాదన చేయగా, రూ.13 కోట్ల అత్తెసరు నిధులు కేటాయించారు. జిల్లా అభివృద్ధికి నిధులు, హామీల అమలు గురించి స్పష్టత లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఎప్పటి నుంచి అమలు చేస్తుందో బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం ప్రజలను నిరాశకు గురిచేసింది.

అన్నదాతకు నిరాశ

వ్యవసాయ– అనుబంధ రంగాలు, రైతు సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఏ మూలకూ చాలవని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. కేటాయించిన నిధులు కూడా పూర్తిస్థాయిలో విడుదల చేసే పరిస్థితి లేదని అంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లు మార్చిన కూటమి ప్రభుత్వం ..ఇప్పుడు బడ్జెట్‌లో అరకొరగా కేటాయింపులు చేసింది. ఇక జిల్లా రైతులకు ఉపయోగపడేలా కొత్తగా ఎలాంటి కేటాయింపులూ చేయలేకపోయింది. గతేడాదికి సంబంధించి ఉచిత పంటల బీమా కింద పరిహారం ఊసే ఎత్తలేదు. కొత్తగా అమలు చేస్తున్న పంటల బీమా పథకాలకు రైతులపై ప్రీమియం భారం మోపింది. ఖరీఫ్‌లో 2 శాతం, రబీలో 1.5 శాతం, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే తప్ప బీమా పథకం వర్తించే పరిస్థితి లేదు. గత ప్రభుత్వం అమలు చేసిన సున్నా వడ్డీ పంట రుణాలు, పావలా వడ్డీ పథకాలకు కేటాయించిన బడ్జెట్ చాలదంటున్నారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు సర్కారు... ఇప్పుడు పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6 వేలతో కలిపి రూ.20 వేలు ఇస్తామంటోంది. అయితే అందుకు కేటాయించిన బడ్జెట్ కూడా చాలదని చెబుతున్నారు. దీంతో ఒక్క అనంతపురం జిల్లాలోనే 5.70 లక్షల మంది రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

భృతి..భ్రాంతి

ఇంటికోద్యోగం.. లేదంటే రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. బడ్జెట్ కేటాయింపుల్లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 4.84 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. వారంతా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి భృతి ఇస్తారని వేయి కళ్లలో ఎదురుచూసినా చివరకు నిరాశ తప్పలేదు.

మహిళలకు మొండిచేయి

మహిళలకు ఈ బడ్జెట్‌లో మొండిచేయి చూపారు. ఉచిత బస్సు ప్రయాణమంటూ ఊరించినా బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదు. ఇక 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ ఏడాదికి రూ.1,500 ఇస్తామన్న హామీని కూడా పూర్తిగా విస్మరించారు. తల్లికి వందనానికి రూ.10 వేల కోట్లకుపైగా అవసరముండగా, కేవలం రూ.2,491 కోట్లే కేటాయించారు. అంటే 25 శాతం మందికి కూడా ఈ పథకం అందే అవకాశం లేదు.

దగా చేశారు



ఇది మోసపూరిత బడ్జెట్. గతంలో జగన్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలుకు బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. ఈ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి ఒక్కదానికి కూడా నిధులు కేటాయించలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతుకు ఏటా రూ.20 వేలు అందించే రైతు భరోసాకు నిధులు కేటాయించక పోగా, విధి విధానాలు రూపొందించాలంటూ అసెంబ్లీలో మంత్రులు చెప్పటం ప్రజలను మోసం చేయటమే. అలాగే 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 అందిస్తామని చెప్పినా.. బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. తల్లికి వందనం అంటూ పంగనామాలు పెట్టారు. ఈ బడ్జెట్ వల్ల జిల్లాకు ఒరిగిందేమీ లేదు. రూ.34712.84 కోట్లుగా ద్రవ్యలోటు చూపినా.. ఆ లోటును ఎలా భర్తీ చేస్తారో చెప్పలేదు.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

ప్రజలను వంచించే బడ్జెట్



కూటమి ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను వంచించే విధంగా ఉంది. ఇది అన్ని వర్గాల ప్రజలను మోసం చేసే బడ్జెట్. ఏ రంగానికి సంపూర్ణంగా నిధులు కేటాయించక పోవటం దారుణం. ఎన్నికల్లో హామీలిచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తుంగలో తొక్కే విధంగా సర్కార్ అడుగులు వేసింది. సూపర్ సిక్స్ పథకాలు అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించపోవటం ప్రజలను మోసం చేయడమే.

– మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ మంత్రి

నిరుద్యోగులకు కుచ్చు టోపీ



కూటమి ప్రభుత్వం బడ్జెట్‌తో ప్రజలను మరోసారి మోసం చేసింది. ఈ బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి నిధులు పైసా కేటాయించకుండా నిరుద్యోగులకు కుచ్చు టోపీ పెట్టింది. నిధుల కేటాయింపుపై ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబించటం మోస పూరితం. రైతులు, మహిళలు, విద్యార్థులు...ఇలా అన్ని వర్గాల వారినీ ఈ బడ్జెట్ ద్వారా మోసం చేసింది. గతంలో వైఎస్ జగన్ సర్కార్ ఇచ్చిన ప్రతి హామీకి నిధులు కేటాయించి పథకాలు అమలు చేసింది. ఈ బడ్జెట్‌లో పుట్టపర్తి నియోజకవర్గానికి తీరని అన్యాయం జరిగింది.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పుట్టపర్తి

దగా పడ్డ రైతాంగం



రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చారు. కానీ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధితో కలిపి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గం. రాయలసీమ ప్రాంతంలో పంట పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు అప్పులు పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామన్న హామీని విస్మరించారు. హెచ్చెల్సీ లైనింగ్ పూర్తి, హంద్రీనీవా కాలువ వెడల్పునకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకుండా రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం దగా చేసింది.

– ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

చిరుత, ఎలుగుబంటి మృతి



మృతి చెందిన చిరుత



ఎలుగు బంటి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

మడకశిర రూరల్/రొళ్ల: మడకశిర నియోజకవర్గంలో చిరుత, ఎలుగుబంటి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాయి. వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘటనలు జరిగాయి. మడకశిర మండలం మధుగిరి రోడ్డులోని రెండు కొండల మధ్య ప్రధాన రహదారి పక్కన ఏడాది వయసున్న ఆడ చిరుత సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. అటుగా వెళ్తున్న వారు ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ విషయం అటవీ శాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, సబ్ డీఎఫ్‌ఓ ఆనంద్, స్థానిక అటవీశాఖ అధికారి కుళ్లాయప్ప, వెటర్నరీ ఏడీ అమర్‌నాథ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని.. చిరుత కళేబరాన్ని పరిశీలించారు. రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉండొచ్చని డీఎఫ్‌ఓ చక్రపాణి తెలిపారు. చిరుత కళేబరానికి పోస్టుమార్టం చేసిన అనంతరం దహనం చేశారు.

వక్కతోటలో ఎలుగు...

రొళ్ల మండలం బాజయ్యపాళ్యం–కురబరహట్టి గ్రామాల సమీపంలో వక్కతోటలో సుమారు 15 ఏళ్ల వయసున్న ఎలుగుబంటి మృతిచెందింది. ఇది ఆదివారం సాయంత్రం ఆహారం కోసం గ్రామాల్లోకి రావడంతో ప్రజలు పరుగులు తీశారు. ఈ క్రమంలో నాగరాజు అనే రైతుపై దాడి చేసి గాయపరిచింది. అనంతరం ప్రజలు పెద్దఎత్తున శబ్దాలు చేయడంతో ఎలుగు బంటి సమీపంలోని వక్కతోటలోకి వెళ్లి దాక్కుంది. కొండ ప్రాంతానికి తరలించేందుకు అటవీ సిబ్బంది ప్రయత్నించినా.. ఎటూ కదలకుండా తోటలోనే ఉండిపోయింది. సోమవారం తెల్లారేసరికల్లా మృతి చెంది ఉండటాన్ని గ్రామస్తులు గమనించి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. డీఎఫ్‌ఓ చక్రపాణి, స్థానిక అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం తర్వాత ఎలుగుబంటి కళేబరాన్ని దహనం చేశారు. ఎక్కువసేపు పరుగెత్తడం వల్ల ఊపిరాడక మృతి చెంది ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు.

గ్రామసభలు నిర్వహించాల్సిందే

- వారంలో నాలుగు రోజులు తప్పనిసరి
- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 253 అర్జీలు



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుడి సమస్య వింటున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ''రెవెన్యూ అధికారులంతా గ్రామ సభలపై దృష్టి సారించాలి. వారంలో నాలుగు రోజుల పాటు గ్రామ సభలు నిర్వహించాలి. ఆయా గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలి. ఇందులో ఏ ఒక్కరికీ మినహాయింపు లేదు' అని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు, భూ సమస్యలు, హౌసింగ్ తదితర సమస్యలపై 253 అర్జీలు అందజేశారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని పరిశీలించి సకాలంలో పరిష్కారించాలన్నారు. ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. అప్పుడే అర్జీలు రీఓపెన్ కావన్నారు. ఏదైనా సమస్య పరిష్కరించేందుకు వీలుకాకపోతే..ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో అర్జీదారుడికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. కోర్టు కేసులుపై ఎప్పటికప్పుడు కౌంటర్ ఫైల్స్ దాఖలు చేయాలని ఆదేశించారు. నెల చివరి వారంలో ముఖ్యమంత్రితో కాన్ఫరెన్స్ ఉంటుందని, ఆయా శాఖల పరిధిలో నిర్దేశించిన లక్ష్యాలపై సమగ్ర నివేదికలు రూపొందించి సీపీఓకు అందజేయాలన్నారు. త్వరలోనే జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో హిందూపురంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన వివిధ సంక్షేమ పథకాల అమలు, స్వర్ణాంధ్ర –2047 అమలుపై ప్రణాళికలు ఏ విధంగా అమలు చేస్తున్నారని వివరించే నివేదికలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలు, చూపిన పరిష్కారానికి సంబంధించి ప్రతిశాఖ వద్ద సమగ్ర వివరాలు ఉండాలని, అడిగిన వెంటనే అందజేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్ కుమార్, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, డీపీఓ సమిత, లాండ్ సర్వే ఏడీ విజయశాంతి, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, సివిల్ సప్లయీస్ మేనేజర్ అశ్వర్థనాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సంజీవయ్య, ఆర్టీసీ జీఎం రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డెలిగేట్ చైర్మన్‌గా బలరామిరెడ్డి

- క్యాంపు నుంచి వెనుదిరిగి వచ్చిన కౌన్సిలర్లు



బలరామిరెడ్డి

హిందూపురం: మున్సిపల్ డెలిగేట్ చైర్మన్‌గా ప్రస్తుతం వైస్ చైర్మన్–2గా ఉన్న మదిరెడ్డి బలరామిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనంతరాము సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై మున్సిపల్ సమావేశాలు, నిధుల వినియోగంలో డెలిగేట్ చైర్మన్‌గా బలరామిరెడ్డి వ్యవహరిస్తారని, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ చైర్మన్ హోదాలో పాల్గొంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త చైర్మన్ ఎన్నికయ్యేంత వరకూ మున్సిపల్ చైర్మన్‌హోదాలో బలరామిరెడ్డి అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. దీంతో కొన్నిరోజులుగా రసవత్తరంగా సాగుతోన్న హిందూపురం మున్సిపల్ రాజకీయానికి బ్రేక్ పడింది. చైర్మన్ స్థానానికి ఇంద్రజ రాజీనామా చేశారు. దీంతో కేవలం ఆరుగురు కౌన్సిలర్లు ఉన్న టీడీపీ చైర్మన్ స్థానం దక్కించుకునేందుకు ప్రయత్నించింది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసింది. చివరకు వారందరితో హైదరాబాద్‌లో క్యాంపు రాజకీయం నడిపింది.

రెండో వైస్ చైర్మన్‌కు పదవి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హిందూపురం మున్సిపల్ చైర్మన్‌ను మార్చాలని టీడీపీ నేతలు కుట్రలు చేశారు. ఈ క్రమంలోనే చైర్‌పర్సన్‌గా ఇంద్రజను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి ఆమెకు పచ్చ కండువా వేశారు. అనంతరం చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయించారు. అయితే ఆమె రాజీనామా చేసి మూడునెలలు దాటి పోవడం, కొత్త చైర్మన్ ఎన్నిక వాయిదా పడటంతో వైస్ చైర్మన్‌ను డెలిగేట్ చైర్మన్‌గా నియమించారు. వాస్తవానికి చైర్మన్ స్థానం ఖాళీగా ఉన్నప్పుడు వైస్ చైర్మన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఇద్దరు వైస్ చైర్మన్లు ఉంటే తొలి వైస్ చైర్మన్‌కే అధికారం అప్పగిస్తారు. కానీ హిందూపురంలో మాత్రం వైస్ చైర్మన్–2 బలరామిరెడ్డిని డెలిగేట్ చైర్మన్‌గా నియమించారు.

మున్సిపల్ చైర్మన్ స్థానాలన్నింటికీ ఒకేసారి నోటిఫికేషన్!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మున్సిపల్ చైర్మన్ స్థానాలపై కన్నేసింది. ఇప్పటికీ రాష్ట్రంలోని చాలా మున్సిపాలిటీల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులే చైర్మన్‌లుగా ఉన్నారు. దీంతో వారిని తమవైపు తిప్పుకునేందుకు టీడీపీ నేతలు పడరాని పాట్లు పడ్డారు. ఈ నేపథ్యంలోనే హిందూపురంలోనూ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు పలువురిని టీడీపీవైపు తిప్పుకున్నారు. నోటిఫికేషన్ వచ్చేంత వరకూ వారు చేజారకుండా చూసుకునేందుకు వారందరినీ హైదరాబాద్‌కు తీసుకువెళ్లి ఓ రిసార్ట్‌లో ఉంచారు. కానీ టీడీపీ అధిష్టానం...రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల చైర్మన్ ఎన్నికకు ఒకేసారి నోటిఫికేషన్ ఇవ్వాలని భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడిందని సమాచారం. అయితే నిబంధనల ప్రకారం చైర్మన్ స్థానం మూడు నెలలకు మించి ఖాళీగా ఉంచకూడదు కాబట్టి...బలరామిరెడ్డిని డెలిగేట్ చైర్మన్‌గా నియమించినట్లు తెలుస్తోంది. మరోవైపు వారం రోజులుగా హైదరాబాద్‌లో కుటుంబీకులతో కలిసి విందులు, వినోదాలతో ఎంజాయ్ చేసిన కౌన్సిలర్లంతా సోమవారం హిందూపురానికి చేరుకున్నారు. అయితే క్యాంపులో జరిగిన విషయాల గురించి ఎవరికీ చెప్పకూడదన్న టీడీపీ నేతల హెచ్చరికల నేపథ్యంలో వారంతా ఇళ్లకే పరిమితమయ్యారు.

క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి



'అందరికీ క్యాన్సర్ పరీక్షలు' పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: క్యాన్సర్‌పై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ఈనెల 14 నుంచి ఇంటి వద్దనే ఉచితంగా క్యాన్సర్ పరీక్షలకు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 14 నుంచి ఎన్‌సీడీ 3.0 కార్యక్రమం ప్రారంభమవుతుందని, అందులో షుగర్, బీపీ, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయం, ముఖ క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. డీఎంహెచ్‌ఓ మంజువాణి మాట్లాడుతూ, ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్‌పై విజయం సాధ్యం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. జబ్బు రాకముందే జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

చిన్నారులకు చైల్డ్ స్క్రీనింగ్ హెల్త్ కార్డు..

18 ఏళ్లలోపు వయస్సు ఉన్న ప్రతి పిల్లవాడికీ ఆయా ప్రాంతంలోని అంగన్‌వాడీ వర్కర్ లేదా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చైల్డ్ స్క్రీనింగ్ హెల్త్ కార్డును అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 14వ తేదీ బాలల దినోత్సవం రోజున ముఖ్యమంత్రితోపాటు ఆయా జిల్లాల మంత్రులు హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ప్రతి గురు, శనివారాల్లో స్కూళ్లలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి 4 గంటల్లోపు పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా ప్రతి శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు అంగన్‌వాడీ స్కూళ్లలోని పిల్లలకు స్క్రీనింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ సువర్ణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, డీపీఓ సమిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మౌలానా సేవలు స్ఫూర్తిదాయకం



అబుల్ కలామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: భారతరత్న, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం మెదటి విద్యాశాఖ మంత్రిగా ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సాహిత్యం, రచనలు, మేధో సంపత్తి ద్వారా దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. అందుకే ఆ మహనీయుడి జన్మదినాన్ని జాతీయ విద్యాదినోత్సవంగా, మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని ముందుగా సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఏఓ సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాల అరణ్య రోదన

- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 27 మంది పారిశుధ్య కార్మికుల మృతి
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని మొర
- కౌన్సిళ్లలో తీర్మానాలు చేసినా కనికరించని మున్సిపల్ అధికారులు
- కలెక్టర్ ఆదేశాలనూ పట్టించుకోని వైనం



పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం

ప్రశాంతి నిలయం: ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతకు ఏళ్ల తరబడి నిరంతరం పనిచేస్తున్నారు పారిశుధ్య కార్మికులు. చాలీచాలని జీతాలతో కుటుంబ భారాన్ని మోస్తూ ఆరోగ్యం క్షీణించి కొందరు ప్రమాదాల్లో మరికొందరు పారిశుధ్య కార్మికులు చనిపోయారు. అయితే పెద్దదిక్కును కోల్పోయి ఇబ్బందులు పడుతున్న వారి కుటుంబాలకు న్యాయం చేయాలన్న మనసు కలగడం లేదు మున్సిపాలిటీల అధికారులకు. వారికి న్యాయం చేస్తే తమకేంటి? అనుకున్నారో ఏమో గాని చనిపోయిన కార్మికుని స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి పారిశుధ్య కార్మికుడిగా అవకాశం కల్పించమని మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో ఆయా కార్మికుల కుటుంబాల ఆవేదన అరణ్య రోదనగానే మిగిలిపోతోంది.

జిల్లాలో 27 మంది మృతి..

జిల్లాలో గత మూడేళ్లలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ 27 మంది మృతి చెందారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో - 6 మంది, ధర్మవరంలో నలుగురు, హిందూపురంలో 8 మంది, మడకశిరలో ఒక్కరు, కదిరిలో 8 మంది కార్మికులు చనిపోయారు. ప్రతి కార్మికుడికి విధిగా సాధారణ మరణం అయితే రూ.2 లక్షలు, ప్రమాదంలో మరణించి ఉంటే రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు వారి కుటంబంలో ఒకరికి పారిశుధ్య కార్మికుడిగా అవకాశం ఇవ్వాలి. కార్మికుడు మరణించిన మూడు నెలల్లోపు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి కార్మికుడిగా అవకాశం కల్పించే ప్రక్రియను కుటుంబ సభ్యులతో సమాచారం తీసుకుని సంబంధిత మున్సిపల్ కార్యాలయం అధికారులు పూర్తి చేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదించాలి. ఆయన అనుమతించిన తరువాత మున్సిపల్ రికార్డులలో సీఆర్ నమోదు చేసుకుని ఆఫ్కాస్ జిల్లా చైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్‌కు సంబంధిత ఫైల్‌ను పంపాలి. ఆయన అనుమతితో కార్మికుల కుటుంబం నుంచి ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. ఎక్స్‌గ్రేషియాకు సంబంధించి మున్సిపల్ అధికారులు సీడీఎంఏ అనుమతి తీసుకుని మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచి చనిపోయిన కార్మికుని కుటుంబానికి నిబంధనల మేరకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు. అయితే ఆయా మున్సిపల్ అధికారులు చనిపోయిన కార్మికులు విషయంలో ఇవేవీ సకాలంలో చేయకపోవడంతో మూడేళ్లు గడుస్తున్నా కార్మికులకు దక్కాల్సిన ప్రయోజనాలు దక్కడం లేదు. దీంతో చనిపోయిన కార్మికుల కుటుంబాలు వారి కుటుంబాలను నెట్టుకురాలేక నానా అవస్థలు పడుతున్నారు.

కలెక్టర్ ఆదేశించినా..

బాధిత కార్మికులు కుటుంబాలు పలుమార్లు కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా తమకు పారిశుధ్య కార్మికులుగా అవకాశం కల్పించాలని, తమక దక్కాల్సిన ప్రయోజనాలు దక్కడం లేదని మొరపెట్టుకోవడంతో వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అయితే నేటికీ కలెక్టర్ ఆదేశాలను సదరు మున్సిపల్ అధికారులు పాటించకపోవడంతో కార్మికుల కుటుంబాలకు న్యాయం జరగలేదు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కార్మికుల కుటుంబాలు వేడుకుంటున్నాయి,

కుటుంబ పోషణ భారంగా ఉంది



నా భర్త గంగాద్రి పుట్టపర్తి మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా 17 సంవత్సరాలు పనిచేశాడు. అనారోగ్యంతో మూడేళ్ల క్రితం చనిపోయాడు. మా కుటుంబానికి ఆయనే పెద్ద దిక్కు. ఇప్పుడు నా పిల్లల చదువుల పోషణ భారంగా మారింది. పారిశుధ్య కార్మికురాలిగా అవకాశం కల్పించాలని మూడేళ్లుగా వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వెంటనే నాకు న్యాయం జరిగేలా చూడాలి.

– నాగలక్ష్మి, పారిశుధ్య కార్మికుడి భార్య, పుట్టపర్తి

వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి



మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాల్లో ఒకరికి వెంటనే ఉద్యోగం కల్పించాలి. వారికి అందాల్సిన బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తాము. కలెక్టర్ స్పందించి వెంటనే మరణించిన కార్మికుల కుటుంబాలకు అండగా నిలబడాలి.

– లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు


ఇంద్రతేజ (ఫైల్)

ధర్మవరం అర్బన్: నేత్రదానంతో మరో ఇద్దరికి చూపును అందించడం హర్షణీయమని విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్ల మొరం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా పొట్టిపాడు గ్రామానికి చెందిన గొల్ల ఇంద్రతేజ (17) ఆదివారం మరణించగా విశ్వదీప సేవా సంఘం సభ్యులు వారి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ శ్రీకాంత్ సహకారంతో అనంతపురం సర్వజనాస్పత్రిలో మృతుని నేత్రాలను సేకరించామన్నారు. దాత తల్లిదండ్రులు గొల్ల నరసింహులు, ఆదిలక్ష్మిలకు సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వేరు కాపురం పెట్టలేదని వివాహిత ఆత్మహత్య


మృతురాలు అశ్విని

సోమందేపల్లి: మండలంలోని నాగినాయని చెరువు గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ రమేష్ వివరాలమేరకు.. గోరంట్ల మండలం శెట్టిచిన్నంపల్లి గ్రామానికి చెందిన అశ్విని (26)కి నాగినాయని చెరువుకు చెందిన హరితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం భర్త బేల్దార్ పనికి వెళ్లగా ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఇంటిలోని కిటికీకి ఉరేసుకుంది. ప్రస్తుతం అత్తా మామలతో కలిసి కాపురం ఉంటుండగా కొంతకాలంగా వేరే కాపురం పెట్టాలని గొడవపడి మనస్తాపంతో ఆమె బలవన్మరణానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


కేతిరెడ్డి నరసింహారెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు గ్రామంలో సోమవారం యువ రైతు కేతిరెడ్డి నరసింహారెడ్డి (34) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. దొరిగిల్లులో తన పొలం పక్కనే ఉన్న మరో రైతు వ్యవసాయ మోటర్‌కు ఉన్న విద్యుత్ సరఫరా సక్రమంగా లేక మోటరు నిలిచిపోయింది. ఈ విషయాన్ని సమీపంలో ఉన్న కేతిరెడ్డి నరసింహారెడ్డికి తెలిపారు. విద్యుత్ స్టార్టర్ పెట్టె వద్దకు చేరుకొని విద్యుత్ వైర్లు సరిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య మౌనిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల కోసం ఎదురుచూపు

అనంతపురం అగ్రికల్చర్: బదిలీల ఉత్తర్వుల కోసం వ్యవసాయశాఖ అధికారులు ఎదురుచూస్తున్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు కొలువుతీరిన తర్వాత ఇటీవల చాలా ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో బదిలీలు జరిగాయి. అయితే వ్యవసాయ, అనుబంధ శాఖలకు మాత్రం వెసులుబాటు లభించలేదు. జేడీఏతో పాటు పలువురు ఏడీఏలు, ఏఓలు చాలా మంది బదిలీ ఉత్తర్వులు వస్తే కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి స్థానాలు సిద్ధం చేసుకుని ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం బదిలీ ప్రక్రియ చేపట్టే పరిస్థితి లేకపోవడంతో వచ్చే ఏడాది వరకూ ఎదురు చూడాల్సివచ్చేలా ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్‌శాఖల్లో ఇదే పరిస్థితి ఉండటంతో వారంతా సర్కారుపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు డెప్యుటేషన్ల కింద వెళ్లడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వ్యవసాయ, అనుబంధ శాఖల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారం చూపాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి ఫిర్యాదుదారుల నుంచి 50 అర్జీలు స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సైబర్ మోసాలు, తదితర సమస్యలపై ఫిర్యాదుదారులు నేరుగా ఎస్పీకి న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. విచారణ చేసి ఫిర్యాదు అంశాలలో వాస్తవాలు ఉంటే చట్ట పరిధిలో తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిశీలించి బాధితులకు న్యాయం జరిగే విధంగా పరిష్కారం చూపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం బాధితుల నుంచి 50 అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ ప్రదీప్ కుమార్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

గుడిసెల కూల్చివేతపై నిరసన

- పోలీసుల అత్యుత్సాహంపై సీపీఎం నాయకుల ఆగ్రహం


మామిళ్లకుంట క్రాస్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

పుట్టపర్తి అర్బన్: 'వందలాది మంది పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు అన్యాయంగా కూల్చివేశారు. మహిళలు, చిన్నారులు ఉన్నారన్న స్పృహ లేకుండా ఇష్టారాజ్యంగా జేసీబీలో తొలగించిన హిందూపురం రెవెన్యూ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన వారికి వెంటనే న్యాయం చేయాలి' అంటూ నిరుపేద మహిళలు, సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సీపీఎం హిందూపురం కమిటీ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ముట్టడించడానికి భారీగా తరలివచ్చిన నిరసనకారులను పుట్టపర్తి మండల పరిధిలోని మామిళ్లకుంట క్రాస్‌లో పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. హిందూపురం నుంచి రైలులో క్రాస్‌కు చేరుకున్న వారిని అడ్డుకోవడంతో అక్కడే వారు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేశారు. ఎస్పీ రత్నతో వాగ్వివాదానికి దిగారు. ధర్నాను అడ్డుకునేందుకు సుమారు 250 మందికి పైగా పోలీస్ అధికారులు సిబ్బందిని ఏర్పాటు చేయడంపై సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ హిందూపురం సమీపంలోని కొల్లకుంట సర్వే నంబర్ 21లో ప్రభుత్వ భూమిలో ఏడాది క్రితం సుమారు 500 మందికి పైగా పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే గుడిసెలను కూల్చివేశారన్నారు. దీనికి కారణమైన హిందూపురం తహసీల్దార్, వీఆర్‌ఓ, సీఐ,ఎస్‌ఐలపై చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం 15 మందిని అనుమతించడంతో కలెక్టర్ చేతన్‌కు, ఎస్పీ రత్నకు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టర్ చేతన్ స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన ముగించారు. ధర్నా కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేషు తదితరులు ఉన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టాలి


మాతా శిశు మరణాలపై సమీక్ష నిర్వహిస్తున్న, జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలో మాతా శిశు మరణాలను అరికట్టేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి మంజువాణి ఆధ్వర్యంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్లలో జిల్లాలో సంభవించిన 6 మాతృమరణాలు, 11 శిశుమరణాలకు గల కారణాలపై ఆయా ప్రాంతాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ గర్భిణీలకు ప్రసవం తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్యసేవలు అందించాలన్నారు. మాతృ,శిశు మరణాలు జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్, గైనకాలజిస్ట్ శారదాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వి సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

మదరసా నుంచి ఇద్దరు బాలికల పరారీ

- 12 గంటల వ్యవధిలోనే వారిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కదిరి టౌన్: పెళ్లి చేస్తారని ఒకరు.. ఇంట్లో పరిస్థితులు బాగలేక మరో బాలిక సోమవారం తెల్లవారు జామున పట్టణంలోని నిజాంవలీ కాలనీలో ఉన్న మిస్బాహుల్ బనాత్ మదరస్సా నుంచి పరారయ్యారు. అయితే 12 గంటల వ్యవధిలోనే వారిద్దరిని ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇద్దరు మైనర్లు ఆరేళ్లుగా మదరసాలో ఉండి చదువుకుంటున్నట్లు చెప్పారు. 17 ఏళ్ల ఉన్న బాలికకు తల్లిదండ్రులు పెళ్లి చేస్తామని చెప్పారు. అలాగే 15 ఏళ్ల ఇంకో బాలిక ఇంట్లో పరిస్థితులు సరిగా లేకపోవడంతో వారిద్దరూ మదరసా గోడ దూకి పారిపోయారన్నారు. మదరసా ముతవల్లితో పాటు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని చెప్పారు. బెంగళూరులో బాలికలను గుర్తించి అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. 12 గంటల వ్యవధిలోనే బాలికల మిస్సింగ్ కేసును ఛేదించినందుకు పోలీసులను ఎస్పీ వి.రత్న అభినందించారు.

బస్సు - ద్విచక్ర వాహనం ఢీ

- తండ్రి కొడుకుకు తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాద దృశ్యం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని బత్తలపల్లి గంటల మారెమ్మ కనుమ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ లింగన్న వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం అనంతపురంకు చెందిన దేవేంద్ర ద్విచక్ర వాహనంపై రెండున్నర సంవత్సరాల కుమారుడు శరత్‌కుమార్‌ను కూర్చోబెట్టుకొని గోరంట్ల వైపునకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో గోరంట్ల నుండి ధర్మవరం వైపునకు ఆర్టీసీ బస్సు వెళ్తోంది. గంటల మారెమ్మ కనుమ ఆర్టీసీ బస్సు - ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో శరత్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా కోమాలోకి వెళ్లాడు. దేవేంద్ర తలకు బలమైన గాయాలు అయ్యాయి. అదే సమయంలో అటు వైపుగా వెళ్తున్న హిందూపురం డీఎస్పీ మహేష్ తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్యసాయి ఆస్పత్రికి తన స్వంత వాహనంలో తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వారిని అనంతపురం తరలించారు. క్షతగాత్రుల బంధువులు ఎవరూ లేకపోవడంతో రూరల్‌స్టేషన్ కానిస్టేబుల్ వెంట వెళ్లారు. ప్రస్తుతానికి ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మల్టీపర్పస్ సొసైటీల ఏర్పాటుకు చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలో కొత్తగా మల్టీపర్పస్ సొసైటీలను ఏర్పాటు చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నాబార్డ్, సహకార, మత్స్య, పశుసంవర్ధక తదితర శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి వ్యవసాయ, పాల, మత్స్య బహుళ ప్రయోజన సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. నిర్దేశించిన గడువు లోపు మల్టీపర్పస్ సొసైటీలను ఏర్పాటు చేయాలని, దీనికి సత్వరమే చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 54 పీఏసీఎస్‌లు ఉండగా అదనంగా మరో 14 దాకా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇకపై ప్రతి సహకార సొసైటీ 25 రకాల సేవలను అందించేలా మోడల్ బైలాస్ కేంద్రం రూపొందించామన్నారు. సొసైటీలు కామన్ సర్వీస్ సెంటర్లుగా మారబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీడీఎం అనూరాధ, డీసీఓ కృష్ణనాయక్, సీఈఓ ఆంజనేయులు, డీసీడీఎం ఆప్కాబ్ తేజస్విని, మత్స్య శాఖ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, పశు సంవర్ధకశాఖ డీఎహెచ్‌ఓ డాక్టర్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఎనుములపల్లి చెరువు దగ్గర..

సాయంకాలం.. సాగర తీరం


రాయలవారిపల్లి సమీపంలో సంధ్యా సమయంలో..


కోవెలగుట్లపల్లి సమీపంలో ..

పుట్టపర్తి రూరల్: చిత్రావతి నదీ తీరంలో వెలసిన పుట్టపర్తి పట్టణం, సమీప గ్రామాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. చిత్రావతి నదితో పాటు చెరువులు నిండుకుండల్లా మారడంతో ఆయా ప్రాంతాలు కనువిందు చేస్తున్నాయి. ముఖ్యంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సత్యసాయి భక్తుల్లో ఆనందంతో పాటు ఆహ్లాదాన్ని నింపుతున్నాయి.


చిత్రావతి నది తీరాన వెలిగిపోతున్న పుట్టపర్తి పట్టణం